www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 15 జూలై 2025
5
తిరుపతి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 43 వినతులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 43 వినతులు వచ్చాయని కమిషనర్ మౌర్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 15 మంది తమ సమస్యలు తెలుపగా, 28 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ కోరారు. సంజయ్ గాంధీ కాలనీలో మురుగు నీటి కాలువలు శుభ్రం చేయాలని, కొర్లగుంట, మధురా నగర్ లో సి.సి.రోడ్లు ఏర్పాటు చేయాలని, సుందరయ్య నగర్ లో చెట్ల కొమ్మలు తొలగించాలని, దివ్యాంగుల పెంఛన్ ఇప్పించాలని వచ్చిన వివిధ సమస్యలపై ఆయా విభాగాల వారికి పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించామని అదనపు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి రైల్వే స్టేషన్ యార్డులో

రెండు రైలు బోగీలు దగ్ధం

- తప్పిన పెను ప్రమాదం
- మంటలార్పిన ఫైర్ ఇంజన్లు
- ఘటన స్థలాన్ని పరిశీలించిన రైల్వే అధికారులు
- ప్రమాదంపై ఆరా తీసిన సీఎం, డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి రైల్వే స్టేషన్ యార్డులో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఖాళీగా ఉన్న ఒక భోగి కాలి బూడిద కాగా, పక్కనే ఉన్న మరో రైలు భోగి కూడా స్వల్పంగా కాలిపోయింది. ఈ భోగిల్లో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటన స్థలానికి తిరుపతి రైల్వే స్టేషన్ లైజాన్ అధికారి కుప్పాల సత్యనారాయణ, స్టేషన్ మేనేజర్ చిన్నపరెడ్డి, రైల్వే పోలీసులతోపాటు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది హుటాహుటిన చేరుకొని ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజన్లతో సుమారు మూడు గంటలపాటు కృషి చేసి మంటలను అదుపులోకి తెచ్చారు. జరిగిన ఘటనపై రైల్వే బోర్డుతో పాటు రైల్వే శాఖ మంత్రి, ఇటు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా ఆరా తీశారు. తిరుపతి రైల్వే అధికారుల సమాచారం మేరకు హర్యానా రాష్ట్రం హిసర్ జిల్లా నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ నడుపుతుంది. తిరుపతి – హిసార్ రైలు ఈ నెల 8 నుంచి సెప్టెంబర్ 30 వరకు ప్రతి సోమవారం అందుబాటులో ఉంటుందని రైల్వే శాఖ తెలిపింది. ఈ రైలు తిరుపతి రైల్వే స్టేషన్‌కి మధ్యాహ్నం 11:30కు చేరుకోవడం జరిగింది. ప్రయాణికులను దింపిన తర్వాత, రైలును చింతల చేను సమీపంలోని రైల్వే యార్డు వద్ద ఉంచారు. ఈ రైలు తిరిగి సోమవారం రాత్రి 11:30 గంటలకు తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరాల్సి ఉంది. అయితే సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట 20 నిమిషాలకు ఆఖరి భోగి కాలుతూ ఉండడంతో స్థానికులు రైల్వే అధికారులకు సమాచారం అందించారు. రైల్వే శాఖ అధికారులు అగ్నిమాపక శాఖ అధికారులకు తక్షణమే ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక శాఖ వాహనాలు తిరుపతిలో అందుబాటులో లేకపోవడంతో సుమారు గంట సేపు పైగా రైలు భోగి కాలిన తర్వాత అగ్నిమాపక వాహనం రావడం జరిగింది. రేణిగుంట మండలం, గాజులమండ్యంలో ఫ్యాక్టరీ కాలిపోవడంతో రెండు ఫైర్ ఇంజన్లు అక్కడ వెళ్లడంతో ఆలస్యం జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ముందుగా రైల్వే అధికారుల వద్ద ఉన్న చిన్న ఫైర్ ఇంజన్‌తో మంటలార్పినప్పటికీ ప్రయత్నం చేసిన ఫలించలేదని తెలిపారు. ఆ రైలు పక్కనే ఆగిఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలులో జనరేటర్ బోగి కూడా ఈ ప్రమాదంలో కాలిపోయింది. రైల్వే అధికారులు మిగతా బోగీలను వెంటనే వేరుచేశారు. ఇదే సమయంలో తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును తగు జాగ్రత్తలు తీసుకుని పంపడం జరిగిందని అధికారులు తెలిపారు. భోగిలు కాలుతున్న సమయంలో రైల్వే అధికారులు విద్యుత్ సరఫరాను ఆపివేశారు. అనంతరం కాలిపోయిన భోగిలకు బ్యాటరీలను పరిశీలించారు.

రైల్వే శాఖకు భారీ నష్టం..

రెండు బోగీలు కాలిపోవడంతో రైల్వే శాఖకు భారీ నష్టం వాటిల్లినట్లు తెలుస్తుంది. అయితే ఎంత మేరకు నష్టం వచ్చిందో రైల్వే అధికారులు లెక్కలు ఇంకా తేల్చలేదు. రైల్వే సేఫ్టీ అధికారులు పరిశీలించి నష్టం అంచనాను రైల్వే బోర్డుకు నివేదిక పంపనున్నారు.

ఘటనపై సీఎం, డిప్యూటీ సిఎం ఆరా..

రైలు బోగీలు దగ్ధం కావడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు ఆరా తీసినట్లు సమాచారం. రైల్వే బోర్డు ఉన్నతాధికారులు ప్రమాదం జరగడానికి కారణాలను అధికారుల ద్వారా తెలుపుకున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందా.. మరే ఇతర కారణాలున్నాయాని అధికారులు విచారణ చేస్తున్నారు. ఈ ఘటనపై నివేదిక ఇవ్వాలని రైల్వే బోర్డు అధికారులు తిరుపతి స్టేషన్ అధికారులకు ఆదేశించారు. గతంలో కూడా ఇదే తరహాలో రైల్వే స్టేషన్ యార్డులో ఒక భోగి దగ్ధమైన విషయం తెలిసిందే. అదే చోట మళ్లీ జరగడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఘటన స్థలాన్ని సందర్శించిన అడిషనల్ ఎస్పీ..

తిరుపతి అడిషనల్ ఎస్పీ రవి మనోహర చారి ఆధ్వర్యంలో ఓ బృందం ఘటన స్థలాన్ని పరిశీలించడం జరిగింది. ప్రమాద వివరాలను స్టేషన్ లైజాన్ అధికారి కుప్పల సత్యనారాయణ, స్టేషన్ మేనేజర్ చిన్నపరెడ్డి, జిల్లా ఫైర్ అధికారి రమణయ్యలను అడిగి తెలుసుకున్నారు.

రైల్వే బోర్డుకి నివేదిక పంపుతాం : తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ

భోగిల దగ్ధం ఘటనపై రైల్వే బోర్డుకి నివేదిక పంపుతామని తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పల సత్యనారాయణ విలేకరులకు తెలిపారు. ప్రమాదానికి సంబంధించి తమకు ఎలాంటి విషయాలు తెలియదని ఎలా ప్రమాదం జరిగిందో రైల్వే ఉన్నత అధికారులు పరిశీలించి తుది నిర్ణయానికి వస్తారని చెప్పారు. ప్రస్తుతం రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేవని అన్ని రైలు సకాలంలో నడుస్తాయని తెలిపారు. తర్వాత జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.

సుద్దాల అశోక్ తేజ రచనలో సిఐటియు పాటలు

సుద్దాల అశోక్ తేజతో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఈ ఏడాది డిసెంబరు 31నుంచి జనవరి 4 వరకు ఐదు రోజుల పాటు విశాఖపట్నంలో జరగనున్న అఖిలభారత మహాసభల సందర్భంగా సిఐటియు విశిష్టతను వివరించేందుకు పాటలను రచించేందుకు సుద్దాల అశోక్ తేజ అంగీకరించారు. తిరుపతి పర్యటనలో ఉన్న సుద్దాల అశోక్ తేజను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, కందారపు మురళి కలిసి చర్చించారు. దేశంలో సిఐటియు ప్రభుత్వ రంగాన్ని కాపాడటానికి, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్వహించిన పాత్ర, విశాఖ ఉక్కు పరిరక్షణ, టీటీడీ లాంటి ఆధ్యాత్మిక క్షేత్రాలు, సాంసంగ్ లాంటి కార్పొరేట్ కంపెనీలు తదితరచోట్ల కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలను పరిష్కరించడానికి నిర్వహించిన పోరాటాలు తదితర అంశాలను వారు చర్చించారు. సిఐటియు అఖిలభారత మహాసభల సందర్భంగా దేశంలోని కార్మిక యోధులు రానున్నారని కోట్లాదిమంది కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిర్వహిస్తున్న పాత్ర అభినందనీయమని, తాను సంతోషంగా సిఐటియు విశిష్టతను వివరించటానికి రచనలు చేస్తానని నర్సింగరావుకు సుద్దాల అశోక్ తేజ హామీ ఇచ్చారు.

పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలి: కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరంలో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నగరంలోని మాధవ నగర్, మధురా నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజల నుండి అందిన ఫిర్యాదుల మేరకు పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉదయం 6గంటల్లోపే నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న చెత్త కుప్పలు తొలగించాలన్నారు. వర్షాలు కురిసిన సమయంలో మురుగునీరు రోడ్లపైకి వస్తున్నాయని పిర్యాదులు వస్తున్నాయని ఆ కాలువలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కాలువల్లో చెత్త, మట్టి లేకుండా ఎప్పటికప్పుడు తొలగించేలా చూడాలన్నారు. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. చెత్త తరించే వాహనాల రాకపోకల సమయాలను నమోదు చేసిన రికార్డులను కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ వెంట డిఈ రమణ, రెవెన్యూ ఆఫీసర్ రవి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి ఉన్నారు.

వైద్య శిబిరం అభినందనీయం : ఎస్పీ

ప్రజాశక్తి - రేణిగుంట: సోమవారం రేణిగుంట మండలం, కరకంబడి అమర హాస్పిటల్‌లో రూ.1.20 కోట్ల వ్యయంతో అమరరాజా గ్రూప్స్, అమరా హాస్పిటల్, కాంటినెంటల్ కాఫీ సంయుక్తంగా తిరుపతి జిల్లా పోలీసు సిబ్బందికి అమర రాజా ఆడిటోరియంలో సోమవారం ఉచిత మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వి. హర్షవర్ధన్ రాజు, అమరా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా.రమాదేవి గౌరినేనిలు ప్రారంభించారు. ఈ శిబిరం 14 నుండి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ సేవా కార్యక్రమాన్ని ముందుకు తీసుకువచ్చిన అమరరాజా గ్రూప్స్, అమరా హాస్పిటల్, కాంటినెంటల్ కాఫీ సంస్థలకు ధన్యవాదాలు తెలియజేశారు. పోలీసుల ఆరోగ్యాన్ని రక్షించేందుకు ఈ శిబిరం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయక, అనుక్షణం సమాజ రక్షణలో ఉంటారని వారి ఆరోగ్య క్షేమం మా బాధ్యతగా భావిస్తున్నామన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

పాఠశాలల విలీనంపై మొండిపట్టు వీడండి : సిపిఎం

కలెక్టర్ కార్యాలయం వద్ద తలిదండ్రులతో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి : జిల్లాలో 600 పైగా ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతూ రోడ్లెక్కి నిరసన తెలియజేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం ప్రకటించకుండా అధికారులు మొండిపట్టుగా ఉండటం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలియజేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు పలు గ్రామాల నుండి తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించమని జిల్లా అధికారులను కోరగా వారు రాష్ట్ర అధికారులకు ప్రతిపాదనలు పంపామని, పైనుండి ఆదేశాలు వచ్చేవరకు తాము ఏమీ చేయలేమని చెప్పడం సరికాదన్నారు. ఏర్పేడు మండలం పల్లంపేట, శ్రీకాళహస్తి మండలం రాజగుంట, కే వి బి పురం మండలం తదితర మండలాల నుండి ప్రజలు తమ బాధను విన్నపాల రూపంలో తెలియజేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొండి పట్టు వీడి అభ్యంతరాలు తెలియజేసిన పాఠశాలల విలీనాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇప్పటికే నెల రోజులు గడిచి విద్యార్థులు పాఠశాలలకు పోకుండా, వీధుల్లో ఉంటే ఏమీ పట్టనట్లు అధికారులు వ్యవహరించడం సరికాదని తెలిపారు. ప్రజా ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని కోరారు. వెంటనే నిర్ణయం చేయకపోతే చలో కలెక్టరేట్ నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం పల్లంపేట ఎస్ఎంసి చైర్మన్ రవి, శ్యామల, శైల తదితరులు పాల్గొన్నారు.

వినుత డ్రైవర్ హత్య కేసును తమిళనాడు పోలీసులే విచారణ చేస్తున్నారు : జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీకాళహస్తి జనసేన నాయకురాలు వినూత డ్రైవర్ హత్య కేసును తమిళనాడు పోలీసులు విచారణ చేస్తున్నారని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రశ్నకు సమాధానంగా మాట్లాడుతూ డ్రైవర్ హత్య కేసుకు సంభందించి జరిగిన వాస్తవాలను మాత్రమే మనం తెలుసుకుంటున్నాం, చెన్నై పోలీసుల విచారణలో రేణిగుంట ప్రాంతంలోనే హత్య జరిగినట్లు చెబుతున్నారు. ఈ కేసు పూర్తిగా తమిళనాడు పోలీసులే విచారిస్తున్నారు, వారికి అవసరమైన మేరకు తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

ఎమ్మెల్యేపై బొజ్జల సుధీర్‌రెడ్డి పై దుష్ప్రచారం ఆపండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: న్యాయ విచారణలో ఉన్న జనసేన కార్యకర్త హత్యోదంతం కేసులో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డిపై కొందరు సోషల్ మీడియాలో కావాలని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ స్థానిక టిడిపి నేతలు సోమవారం డిఎస్పి కి ఫిర్యాదు చేశారు. న్యాయ విచారణ పరిధిలో ఉన్న అంశాన్ని రాజకీయం చేస్తూ రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్, బాలాజీ రెడ్డి, ఖాదర్, వినయ్ కుమార్, సాయి, చందు, బాలాజీ, గిరి. తదితరులు పాల్గొన్నారు.

తమ వద్ద పనిచేస్తున్న డ్రైవర్ రాయుడిని హత్య చేశారనే ఆరోపణల నేపథ్యంలో అరెస్ట్ అయిన జనసేన నాయకులు కోటా వినుత, కోట చంద్రబాబులు శ్రీకాళహస్తి ఎమ్మె ల్యే సుధీర్ రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయటం తగదని, ఏపీ గిరిజన సలహా మండలి సభ్యులు ఎం.సుబ్బయ్య సూచించారు. సబ్ జైలుకు వెళ్లే క్రమంలో కోటా వినుత దంపతులు తమ తప్పేమీ లేదనీ, ఇదంతా కావాలనే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేశారని ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. నేరారోపణ వచ్చినప్పుడు దాన్ని నిరూపించుకునే బాధ్యత వారిదే అన్నారు. ఎమ్మెల్యే పై ఇలాంటి నిందలు వేస్తే ప్రజలే తిరగబడే పరిస్థితి వస్తుందని సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

పాముపొడ తెగులు నియంత్రణకు బేయర్ ఫెలుజిత్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: వ్యవసాయం, జీవ శాస్త్ర రంగాలలో కీలక సామర్థ్యాలు కలిగిన ప్రపంచ సంస్థ బేయర్, వరి సాగులో పాముపొడ తెగులు నుంచి అన్ని మొక్కల భాగాలకు రక్షణ కల్పించడానికి శిలీంద్ర సంహారిణిని ఫెలుజిత్‌ను రూపొందించినట్టు బేయర్ క్రాప్ సైన్స్ విభాగం క్లస్టర్ కమర్షియల్ లీడ్ మోహన్ బాబు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఉత్పత్తి జూలై నెల నుంచి దేశంలోని వరి పండించే రాష్ట్రాలన్నింటిలో అందుబాటులో ఉంటుందన్నారు. తెగుళ్లు, వ్యాధుల నుంచి పెరుగుతున్న సవాళ్లతో వ్యవసాయ రంగం పోరాడవలసి వస్తున్న పరిస్థితుల్లో.. నేలలో ఉద్భవించే ఈ నిరంతర వ్యాధిని రైతులు ఎదుర్కునే విధానాన్ని మార్చడానికి పెన్‌ఫ్లూఫెన్, టెబుకోనజోల్‌లను కలిపిన ప్రత్యేకమైన ఫార్ములాతో సిద్ధంగా ఉందని తెలిపారు. దీనిని వినియోగిస్తే దాని ద్వంద్వ చర్య ద్వారా పాముపొడ తెగులు పెరుగుదలను సమర్థవంతంగా నిరోధిస్తుందన్నారు. రైతులకు పంట దిగుబడి నాణ్యతను పెంచే నమ్మకమైన పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. ప్రస్తుత మార్కెట్ ప్రమాణాల కంటే రెండు రెట్లు ఎక్కువ ఉండే ఉన్నతమైన సామర్థ్యాన్ని ఒక్క బేయర్ ఫెలుజిత్ స్ప్రే అందిస్తుందన్నారు. రైతులు అనేక రకాలను వినియోగించాల్సిన అవసరం, భారం లేకుండా సమర్థవంతమైన వ్యాధి నియంత్రణను సాధించవచ్చునని చెప్పారు. వ్యవసాయ రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలపాడు దళిత గిరిజనులకు భూములు పంచాలి : సిపిఎం

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: సోమవారం కలపాడు భూ పోరాట కమిటీ, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కలపాడు గ్రామ దళిత గిరిజనులు బలహీన వర్గాల వారికి ప్రభుత్వ భూములను పంచాలని డిమాండ్ చేస్తూ తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఎం పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కలపాడు గ్రామపంచాయతీ పరిధి సర్వే నంబర్ 1 లో1441 ఎకరాల ప్రభుత్వ మేత పరంబోకు భూములు ఉన్నాయన్నారు. గ్రామంలో వందలాది మంది భూమిలేని నిరుపేదలు ఉన్నారన్నారని, కుటుంబానికి రెండు ఎకరాలు చొప్పున ఆ భూములను పేదలకు పంచాలని కోరారు. 2013 వ సంవత్సరం నుండి దళిత గిరిజనులు ఈ భూములను ఆక్రమణ చేసుకోవడం జరిగిందన్నారు. అప్పటినుండి మండల స్థాయి అధికారులు జిల్లా స్థాయి అధికారులు చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. వారికి ఇంతవరకు న్యాయం జరగలేదని ఆరోపించారు. గ్రామంలో రాజకీయ పలుకుబడి కలిగిన అగ్రకుల పెత్తందారులు రాత్రికి రాత్రే జెసిపిలను పెట్టి చదును చేస్తున్నారని, వారి పట్ల అధికారుల వైఖరి సానుకూలంగా ఉంటుదని, పేదలకు మాత్రం న్యాయం జరుగడం లేదని ధ్వజమెత్తారు. గ్రామ విఆర్వో అగ్రకుల పెత్తందారులకు కొమ్ముకాస్తున్నారని, అతని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలంతా ఐక్యంగా ఉండి, నివేశ స్థలాలు పోరాడి సాధించుకోవాలన్నారు. పేదలకు న్యాయం జరిగేంతవరకు పోరాటం ఆగదన్నారు. సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కలపాడు గ్రామ గిరిజనులకు వ్యవసాయ కార్మిక సంఘం ఇతర కార్మిక వర్గం అండగా ఉంటుందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం, సిఐటియు జిల్లా నాయకులు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ ఎర్రజెండా ఆధ్వర్యంలో పోరాడి పట్టాలు సాధించుకోవాలన్నారు. పేదలకు సిఐటియు, సిపిఎం ఎల్లవేళలా ఉండగా ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చెంచు కృష్ణయ్య, బాలసుబ్రమణ్యం, సమరం, చెంచు కుమార్, లోకేష్ ,దారా కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కర్లపూడిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు తొలగించండి

- సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - కేవీబీపురం: కేవీబి పురం మండలంలోని కర్లపూడి గ్రామ సమీపంలోని కోవనూరు రెవెన్యూ సర్వే నంబరు 262 బ్లాక్ లో సుమారు 54 ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమిస్తున్నారని కేవీబీపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. వారికి సిపిఎం పార్టీ మద్దతుగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ భూములు ఆక్రమణలు తొలగించి పేదలకు ఇంటి స్థలాలు పంచి, ఇప్పటికే వాడుకుంటున్న స్మశానాలకు కేటాయించి మిగిలిన భూములను భూమిలేని పేదలకు పంచాలని తహశీల్దారుకు విజ్ఞప్తి చేశారు. కేవిబి పురం మండలంలోని కొత్తూరులోని దళితులు 35 మందికి ఇంటి స్థలాలు లేవని, వారికి మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఎగువపూడి గిరిజనులకు ఇప్పటికే నివాసమున్న ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. స్పందించిన తహశీల్దారు మాట్లాడుతూ కర్లపూడిలోని ప్రభుత్వ భూములను ఆక్రమణలు తొలగించి బోర్డులు పెట్టాలని అధికారులను ఆదేశించారు. కొత్తూరు దళితులకు ఇంటి స్థలాల కొరకు ప్రభుత్వ భూమిని సర్వే చేసి నివేదిక ఇవ్వాలని కోరారు. అలాగే ఎగువ పూడిలో గిరిజనులకు నివాసమున్నవారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి సర్వే చేసి రిపోర్టు ఇవ్వాల్సిందిగా వీఆర్వో, సర్వేరు, ఆర్ఐలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కర్లపూడి గ్రామస్తులు మధు వెంకటయ్య, నాగరాజు, కొత్తూరు వరలక్ష్మి, ఎగువపూడి గిరిజనులు రమణమ్మ, వెంకటమ్మ, మూడు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

హస్తకళలకు మంచి రోజులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : రాష్ట్ర హస్తకళలకు అత్యధికంగా జాతీయ అవార్డులు దక్కడం హర్షనీయమని హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. సోమవారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రం హస్తకళలకు పుట్టినిల్లు అన్నారు. ఈ అవార్డులను జిల్లా కలెక్టర్లు, కళాకారులతో కలిసి అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. బొబ్బిలి వీణ, ఏటికొప్పాక బొమ్మలు, పెద్దాపురం సిల్క్, చీరాల సిల్క్, వెంకటగిరి చీర, ధర్మవరం పట్టు, నరసాపురం అల్లికల కుట్టు హస్తకళలకు అవార్డులు వచ్చాయని తెలిపారు. అవార్డులు సాధించిన కళాకారులకు అభినందనలు తెలిపారు. ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ సిసోడియా, హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ కమిషనర్ రేఖారాణి (ఐఎఎస్), ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ వైస్ చైర్మన్ విశ్వ, విజయనగరం జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 301 అర్జీలు

- గడువులోపు ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం: జేసీ శుభం బన్సల్

ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా నలుమూలల నుండి క్షేత్రస్థాయిలో పరిష్కారానికి నోచుకోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ కు వచ్చి ప్రతి అర్జీదారుడుకి నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా అధికారులను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, శివశంకర్ నాయక్,సుధారాణి, రోజ్ మాండ్ లతో కలసి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఎప్పటిలాగే రెవిన్యూ శాఖకు సంబంధించి 136, పంచాయతీరాజ్ 21, సివిల్ సప్లైస్ 19, స్కూల్ ఎడ్యుకేషన్ 12 అర్జీలు వచ్చాయని అధికారులు ప్రకటించారు.

మా భూమిపై ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా..

1979 నుండి తిరుపతి రూరల్ మండలం కుంట్ర పాకం గ్రామపంచాయతీ సర్వేనెంబర్ 197/11లో మా స్వాధీన అనుభవంలో ఉన్న 105 అంకణాల స్థలాన్ని మా అమ్మ కుషీద్ బి సమీప బంధువైన డి.సలీమా తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి కబ్జా చేయడమే కాకుండా వేరొకరికి అమ్మి వేశారు. మా అమ్మ మరణానంతరం స్థలాన్ని చదును చేయడానికి ఈనెల 11న వెళితే సలీమాకు చెందిన కొంతమంది రౌడీ మూకలు మాపై దాడి చేశారని, ఈ ఘటనపై తిరుచానూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు. మా స్థలాన్ని కబ్జా చేసి విక్రయం చేసిన సలీమా, తప్పుడు ఈసీలు జారీ చేసిన రెవిన్యూ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

- డి.పూజిత, ఎన్టీఆర్ కాలనీ, రాజంపేట టౌన్, అన్నమయ్య జిల్లా.

మా భూమిని తమదంటూ కబ్జాకు యత్నం..

కొమ్మి గెరటయ్య అనే వ్యక్తి 16 సంవత్సరాలుగా బాలయ్యపల్లి మండలం వాక్యాం గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 111 లోని వివిధ సర్వే నంబర్లలో గల 8 ఎకరాల 80 సెంట్లులో ఉన్న మా ఉమ్మడి కుటుంబ సభ్యులకు సంబంధించిన భూమిని కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తున్నాడు. మేము నాటిన నిమ్మ మొక్కలను కూడా కొద్దికాలం పెరగనిచ్చి పీకి వేయిస్తున్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిని మేనేజ్ చేస్తున్నాడు. గత పిజిఆర్ఎస్లో జిల్లా కలెక్టర్ దీనిపై తగు చర్యలు తీసుకోవాలని సూచించిన క్షేత్రస్థాయిలో అధికారులు గెరటయ్య జోలికి వెళ్లడానికి వెనుకంజు వేస్తున్నారు. బడా టిడిపి నాయకుడు కావడంతో మాకు న్యాయం జరగడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మా భూమిని మా స్వాధీన పరచాలని కోరుతున్నాం. **- శ్రీరాం విజయమ్మ, వాక్యం గ్రామం, బాలయ్య పల్లి మండలం**

మా బడి నీ మా ఊళ్లోనే ఉంచాలి..

ఏర్పేడు మండల పరిధి పల్లంపేట గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను మా ఊళ్లోనే ఉంచాలి. పల్లం హరిజనవాడకు అధికారులు విలీనం చేయడం భావ్యం కాదని, చిన్నపిల్లలు రాను పోను 6 కిలోమీటర్లు దూరం ఉందని, రాష్ట్ర రహదారి తో పాటుగా ప్రధాన రహదారి కూడలి ఉండడంతో రోడ్డు ప్రమాదాలు నిత్య కృత్యమయ్యాయి. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా విలీన నిర్ణయాలని అధికారులు వెనక్కి తీసుకోవాలి. నెలన్నర అవుతున్న మా పిల్లలను బడికి పంపలేదు. కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన సిపిఎం పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఎస్ఎంసి వైస్ చైర్మన్ వెంకటరమణమ్మ, గ్రామస్తులు శైలజ, శ్యామల, పెంచులమ్మ, పార్వతి, సుజాత, కోటమ్మ పాల్గొన్నారు.

- రవి, ఎస్ఎంసి చైర్మన్, పల్లంపేట, ఏర్పేడు మండలం

బాగా పరిష్కారాల భూమిని దక్కనియడం లేదు..

మా అన్నలు లక్ష్మయ్య, సీనయ్యలు బాగా పరిష్కారాల్లో భాగంగా నాకు 2021లో శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు గ్రామపంచాయతీ సర్వేనెంబర్ 387/3లో 52 సెంట్లు, 387/4లో 1.63 సెంట్ల భూమిని రాసిచ్చారు. అయితే లక్ష్మయ్య కుమార్తె అంజలి ప్రస్తుతం రెవెన్యూ విభాగంలో పనిచేస్తూ తనకు వచ్చిన భూమిని అనుభవంలోకి తీసుకోకుండా అంజలి, ఆమె భర్త మురళి, గుర్రమ్మలు అడ్డుపడుతూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే, పోలీసులు స్టేషన్ కు రమ్మన్న వారు రాకుండా నన్ను ఇబ్బంది పెడుతున్నారు. వయసు మీద పడటంతో పోలీస్ స్టేషన్లో చుట్టూ, ప్రభుత్వ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ న్యాయం కోసం తిరుగుతున్నాను. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ కలుగజేసుకుని నా సమస్యను పరిష్కరించాలి. **- రామచంద్రయ్య, ఇనగలూరు గ్రామం, శ్రీకాళహస్తి మండలం**

గ్రీవెన్స్ డే లో ఇంటి స్థలాల కోసం వినతి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కంచన పుత్తూరుకు చెందిన గిరిజనులు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో తహశీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కంచన పుత్తూరు గిరిజన కాలనీలో నివాసం ఉంటున్నామని, ఒకే ఇంట్లో మూడు నాలుగు కుటుంబాలు వారు నివసిస్తున్నామని, ఎన్నోసార్లు అర్జీలు పెట్టుకున్నప్పటికీ అధికారులు, నాయకులు పట్టించుకోలేదన్నారు. స్పందించిన తహశీల్దార్ శ్రీదేవి సర్వే చేయించి ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు.

గిరిజనులకు ఇంటి పట్టాలు పంపిణీ

మండలంలోని అలత్తూరు పంచాయతీకి చెందిన పట్టాభి గిరిజన కాలనీవాసులకు ఎంతో కాలంగా ఇంటి పట్టాలు లేకుండా తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతుండగా స్పందించిన తహశీల్దార్ శ్రీదేవి వీఆర్వో భాస్కర్‌ను పట్టాభి గిరిజన కాలనీలోని గిరిజనులకు ఎంతమందికి ఇంటి స్థలాలు అవసరము ఉంది అని సర్వే చేసి వివరాలు తెలుసుకొమని చెప్పగా, అందులో 20 మందికి ఇంటి స్థలాలు అవసరమని వీఆర్వో భాస్కర్ సమాచారం ఇచ్చారు. అనంతరం సర్వే నంబర్ 221/1 ఒకటిలో 20 మంది గిరిజనులకు సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా తహశీల్దార్ చేతులమీదుగా పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టాభి గిరిజన కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇంటింటికి చంద్రబాబు మోసం :వైసీపీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఇంటింటికి చంద్రబాబు మోసం - రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో అంటూ వైసీపీ ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించింది. తిరుపతి నియోజకవర్గం పడమర మండలంలో 26వార్డ్ కార్పొరేటర్ తజేన్ ఉదయవంశీ ఆధ్వర్యంలో జరిగిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలు మరచారన్నారు. ఆయనకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఉదయ్ వంశీ, పడమర మండలం వార్డులకు చెందిన అధ్యక్షులు బాలాజీ, వెంకటేష్ రెడ్డి, జీవరత్నం, సుబ్బు, ప్రవీణ్, అనుబంధ విభాగాల నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం.. నిబంధనలకు విరుద్ధం

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన విలీన ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా ఎంఈఓ, డీఈఓ, రాజకీయ ప్రతినిధులు కలిసి చేశారని తిరుపతి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు దొమ్మరాజు ప్రశాంతి రాజు ఆరోపించారు. పాఠశాలలను మోడల్ స్కూల్‌గా, బీపీఎస్‌గా, ఎఫ్ఎస్ స్కూల్‌గా మార్చి దళిత గిరిజనుల పిల్లలకు అన్యాయం చేశారన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఒక కిలోమీటర్ లోపల ఉన్న స్కూలు మార్చేసి విలీనంలో భాగంగా చేయాలని, ఎస్సీ ఎస్టీ కాలనీలో ప్రభుత్వ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని తెలిపారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సోమవారం వినతి పత్రం అందించారు.

వాకాడు ఏపీఎంగా పోలమ్మ

ప్రజాశక్తి - వాకాడు: మహిళా సమైక్య ఏపీఎంగా పోలమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు నగదు రహిత లావాదేవీలపై పూర్తి దృష్టి సారించాలన్నారు.

2వ రోజు కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఇంజినీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె 2వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు ఉపాధ్యక్షులు ఎన్ చిరంజీవి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా మంగళవారం వంట వార్పు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ వాటర్ విభాగం సిఐటియు నాయకులు వెంకటసుబ్బయ్య, నరసింహులు, బుజ్జమ్మ మున్సిపల్ యూనియన్ పారిశుద్ధ్య విభాగం సిఐటియు నాయకులు, జిల్లా జాయింట్ సెక్రెటరీ పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరులో రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు ఏ.పి. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె సోమవారానికి రెండో రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్ కార్మికులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జీ.ఓ. నెంబర్ 36 సంబంధించిన జీతాలు వర్తింప చేయాలని, 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, ప్రభుత్వం సానుభూతి మాటలు కాకుండా నిర్దిష్టమైన హామీలతో, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం కార్యదర్శి దారా కోటేశ్వరావు, పి.భాస్కర్ వై.సుబ్రహ్మణ్యం, కె.పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు గంగ ప్రాజెక్ట్ ఎస్ఈగా రాధాకృష్ణ మూర్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తెలుగుగంగ, గాలేరు-నగరి ప్రాజెక్టుల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా డి. రాధాకృష్ణ మూర్తి సోమవారం తిరుపతి లోని నీటి పారుదల శాఖ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం తెలుగుగంగ ప్రాజెక్ట్‌లో వెంకటగిరిలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. పదోన్నతి జాబితాలో ఉన్న రాధాకృష్ణ మూర్తిని సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలను స్వీకరించారు.

నాగ పడగల వితరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన లక్ష్మి దంపతులు 3.18 కేజీల వెండి నాగ పడగలను సోమవారం కానుకగా అందజేశారు. దేవస్థాన కార్యనిర్వాహణాధికారి టి. బాపి రెడ్డి వెండి నాగ పడగలను అందుకున్నారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ అధికారులు స్వామి అమ్మవార్ల దర్శనం చేయించారు.

అధికారుల అవినీతిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదికలో, డక్కిలి మండలంలో జరిగిన భూ అక్రమాలను పరిశీలించాలని, అక్రమంగా ఉన్నత వర్గాలకు ధారాదత్తం చేసిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని సదరు భూమిని డక్కిలి మండలంలోని భూమిలేని గిరిజనులకు ఇవ్వాలని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్‌కు యానాదుల సంక్షేమ సంఘం, తిరుపతి జిల్లా కమిటీ వారు కోరారు. సానుకూలంగా స్పందించిన జేసీ గూడూరు సబ్ కలెక్టర్‌తో మాట్లాడి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు తలపల చెంచు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని బతకనివ్వండి.. గౌడ్ వైన్స్ యజమానులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని కె ఎన్ రోడ్డు కల్యాణపురం వద్ద ఉన్న (కల్లుగీత కార్మికులు)గౌడ మద్యం దుకాణాదారులపై, కొద్ది దూరంలో ఉన్న గంగా వైన్స్‌కు చెందిన యాజమానులు దౌర్జన్యం చేసి, దాడికి పాల్పడ్డారని, అయితే ఈ విషయం పోలీసులకు, ఎక్సైజ్ శాఖ అధికారులకు విన్నవించుకున్నా వారు పట్టించుకోలేదని వాపోయారు. సుమారు 28 కుటుంబాలు ఈ ఒక్క వ్యాపారం మీద ఆధారపడి ఉందని తెలిపారు. గౌడ్ వైన్స్ యజమాని మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సుమారు 28 మంది కలిసి తిరుపతి జిల్లాలో మద్యం దుకాణాన్ని తీసుకున్నామని తెలిపారు. మొదటగా దుకాణాన్ని పుత్తూరు మండలంలోని కొండల చెరువు బైపాస్ వద్ద, అక్కడ నుండి అభ్యంతరాల పేరుతో రాచపాలెం, అక్కడ నుంచి కేఎన్ రోడ్డు వద్దకు మార్పులు చేయాల్సిందిగా స్థానిక ఎక్సైజ్ అధికారుల చెప్పడంతో దుకాణాన్ని మార్చుకున్నామన్నారు. చివరికి పట్టణంలోని కల్యాణపురం వద్ద పెట్టుకోవాల్సిందిగా ఎక్సైజ్ అధికారులు చెప్పడంతో మూడు నెలల క్రితం మద్యం దుకాణాన్ని మార్చుకున్నామని తెలిపారు. అయితే మరసటే రోజు గంగా వైన్స్ దుకాణాదారులు, వారి అనుచరులతో వచ్చి తమపై దౌర్జన్యం చేశారని ఆరోపించారు. ఇక్కడ మద్యం దుకాణం పెట్టకూడదని, వెంటనే తీసివేయకపోతే కాల్చివేస్తామని బెదిరించారన్నారు. ఈ విషయమై స్థానిక సీఐకి ఫిర్యాదు చేసినా ఆయన పట్టించుకోలేదన్నారు. వారం రోజుల క్రితం దాడి చేసిన వారే మరలా శనివారం దౌర్జన్యం చేసి, మా దుకాణానికి తాళాలు వేశారని తెలిపారు. ఈ విషయాన్ని పోలీసు, ఎక్సైజ్ వారి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. చివరకు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయగా ఆయన సూచనల మేరకు షాపువద్ద బందోబస్తు ఏర్పాటు చేశారని తెలిపారు.

మేత పోరంబోకు భూమిలో ఫ్యాక్టరీలకు అనుమతులు ఇవ్వొద్దు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రూరల్ మండల పరిధిలోని మేకనూరు గ్రామస్తులు వారి గ్రామానికి చెందిన మేత పోరంబోకు భూముల్లో ఫ్యాక్టరీల నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నారని, వెంటనే ఆపాలని సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సుమారు 150 మంది నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మేకనూరు గ్రామంలో సర్వేనెంబర్ 1లో 260 ఎకరాల మేత పోరంబోకు భూమి ఉందని, ఈ భూమిని నమ్ముకుని సుమారు 400 కుటుంబాలు వారు పశువులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కానీ ఈ భూమిలో కొందరు ఫ్యాక్టరీలను నిర్మించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇదే జరిగితే మేము జీవనాధారం కోల్పోతామని, ఫ్యాక్టరీ ఎలా నిర్మాణానికి ఎటువంటి పరిస్థితుల్లో మేము ఒప్పుకోమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొర్ల విజయ, ముమ్మడి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల మరమ్మతులపై విచారణ చేపట్టండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నుండి విందూరు మీదుగా గిద్దలూరు వరకు చేపట్టిన మరమ్మతుల పనులపై విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నుండి విందూరు మీదుగా గిద్దలూరు వరకు చేపట్టిన రోడ్డు మరమ్మత్తు పనుల్లో అవకతవకలు జరిగాయని, అలాగే గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు, కోట, వాకాడు మండలాల్లో జరిగిన సిలికా అక్రమ మైనింగ్ .. వీటన్నిటిపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించి, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిల్లకూరు వేమయ్య, సుబ్బరాజు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మా పాఠశాల మా ఊళ్లోనే ఉండాలి

సొంత ఊర్లోనే పాఠశాల ఉండాలని కలెక్టరేట్లో నినదిస్తున్న పాతపాలెం హరిజనవాడ వాసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దళితులమని హీనంగా చూస్తూ గ్రామం నుండి మమ్మల్ని అగ్రకులాల వానే వెలివేసినా మా పిల్లలకు చదువులు కావాలని తామంతా రూపాయి రూపాయి కూడా పెట్టి మాకంటూ ఒక పాఠశాల ఉండాలని స్థలాన్ని కొనుగోలు చేశాం. మేము కొనుగోలు చేసిన స్థలంలో 2003లో ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలను నిర్మించిందని, కానీ మా పిల్లలు చదువుకుంటున్న ప్రాథమిక పాఠశాలను పాతపాలెం బీసీ కాలనీకి విలీనం చేయడాన్ని దీనిని వ్యతిరేకిస్తున్నామని కేవిబిపురం మండలం, పాతపాలెం గ్రామస్తులు తెలిపారు. తామంతా దళితులమని, విద్యతో మా పిల్లల భవిష్యత్తు బాగు చేసుకోవాలని చూస్తున్న తరుణంలో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన పాఠశాలల విలీనాన్ని తామంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రాథమిక పాఠశాల వయసున్న విద్యార్థులను కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు పంపాలంటే మార్గమధ్యలో ఉన్న అవాంతరాలను అధికారులు ఎందుకు అధ్యయనం చేయడం లేదని ప్రశ్నించారు. నేడు జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను చూసి మా పిల్లలను విలీనమైన పాఠశాలలకు పంపాలంటే భయకంపితులమవుతున్నామని వాపోయారు. సర్కారు మొండి వైఖరి వీడి ఎప్పటికైనా మారుమూల ప్రాంతాలలో విలీన ప్రక్రియను ఆపాలని, కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ అనాలోచిత నిర్ణయానికి విద్యకు దూరమయ్యేవారు అధికమవుతున్నారని, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో ఉన్న దళిత, గిరిజన తెగలకు సంబంధించిన వారే ఉంటారని ప్రభుత్వం గుర్తించాలి. 36 మంది విద్యార్థులు పాఠశాలలు రాష్ట్రంలో పున ప్రారంభం అయిన నాటి నుండి నేటి వరకు పాఠశాలలకు వెళ్లలేదు. బ్రతికుంటే చాలని తల్లిదండ్రులే నిర్ణయం తీసుకునేలా ప్రభుత్వం వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కేవిబిపురం మండలం పాతపాలెం హరిజనవాడలో తాము ఏర్పాటు చేసుకున్న పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని ఇటు ప్రభుత్వానికి, అటు అధికారులను వేడుకుంటున్నాం.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్లో పాపా నాయుడుపేట విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఏర్పేడు: తిరుపతి గిరిజన భవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి గ్రాఫిలింగ్ రెజ్లింగ్ పోటీలలో జిల్లా జట్టుకు సంబంధించి పాపా నాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శీను, భార్గవ్, విశాలి, కాజల్, నీల, గౌరీ, ముని, పల్లవి పాల్గొన్నారు. వీరిలో కాజల్ స్వర్ణ పతకం(29 కిలోల విభాగం), విశాలి రజత పథకం(29 కిలోల విభాగం), నీల, గౌరీలు(38 కిలోల విభాగం), శ్రీను(30 కిలోల విభాగం) కాంస్య పథకాలు సాధించారు. విద్యార్థులను, వ్యాయామ సంచాలకులు పుష్పవాణిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో సత్తాచాటిన జిల్లా కళాకారులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 12-13 వ తేదీలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్ యోత్రన్ పెంట థిన్ (ఇపెంటాతలోన్) "లేబర్ రన్ 2025-26 స్టేట్ పోటీలు గుంటూరు జిల్లా (ఉమ్మ) నర్సారావుపేట, కోజల శివప్రసాద్ స్టేడియంలో జరిగాయి. ఈ పోటీలలో తిరుపతికి చెందిన పవన్ కళ్యాగ్ సిల్వర్ మెడల్ (మెన్ విభాగం), అంథర 19 మెన్సీ విభాగంలో కె.పునీత్ కు బ్రౌన్స్ మెడల్, అండర్ - 15 విభాగంలో కె. కార్తిక్, మోహిత్ సిల్వర్ మెడల్ సాధించారని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోర మోనిక తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు విజయం సాధించిన ఈ క్రీడాకారులు త్వరలో బీహార్‌లో జరగనున్న జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్నట్లు వెల్లడించారు. విజయం సాధించిన క్రీడాకారులు సోమవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్, మోటివేటర్, హరిబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - తొట్టంబేడు : మండలంలోని చోడవరం పంచాయతీ గద్దగుంటకు చెందిన చెరువును గత ప్రభుత్వంలో నాయకుల అండదండలు చూసుకొని ఆ గ్రామానికి చెందిన ఒక నాయకుడు ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేయగా అప్పట్లోనే గ్రామస్తులు అడ్డుకొని చెరువు స్థలం చుట్టూ కంచె వేసి కాపాడుకున్నారు. మరల అదే నాయకుడు కూటమి ప్రభుత్వ నాయకుల అండదండలతో తిరిగి చెరువును సోమవారం ఆక్రమించుకోవడానికి ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్, రెవిన్యూ శాఖ అధికారులు అక్కడికి చేరుకొని ఇరు వర్గాల వారికి సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

ప్రజాశక్తి వార్తకు స్పందన

రామచంద్రాపురం తహశీల్దారుగా మధుసూదన్ రావు

ప్రజాశక్తి - రామచంద్రాపురం : తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గ, రామచంద్రపురం మండల రెవెన్యూ తహశీల్దారుగా మధుసూదన్ రావును నియమిస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రామచంద్రాపురం మండల రెవెన్యూ తహశీల్దార్‌గా పనిచేసిన కే వెంకటరమణ జూన్ 30వ తారీఖున ఉద్యోగ విరమణ పొందారు. అప్పటినుండి తహశీల్దార్ లేకపోవడంతో రైతులు, ప్రజలు, విద్యార్థులు పలువురు వివిధ ధృవ పత్రాల కోసం ఇబ్బంది పడుతున్నారు. ప్రజాశక్తి దినపత్రికలో తహశీల్దారు నియామకం జరిగేనా...? అనే శీర్షికతో వార్త ప్రచురణ అయింది. దీనిపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని స్పందించి 24 గంటల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులుతో చర్చించి కలెక్టరేట్లో పని పనిచేస్తున్న మధుసూదన్ రావును ఆర్ సి పురం తహశీల్దారుగా నియమించారు. మధుసూదన్ రావు సోమవారం ఉదయం 10 గంటలకు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది నూతన తహశీల్దారుకు అభినందనలు తెలియజేశారు. తహశీల్దారు నియామకంలో కృషి చేసిన ఎమ్మెల్యే నానికి, ప్రజాశక్తికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్ రావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరా హరి ప్రసాద్, లెక్కల మహేష్ నాయుడు, లెక్కల సురేందర్ నాయుడు, డిప్యూటీ తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా హస్తకళల ఉత్పత్తులకు జాతీయ స్థాయి గుర్తింపు

- బంగారు కేటగిరీలో అవార్డును అందుకున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్
- ఓడిఓపి ద్వారా మరింత ప్రోత్సాహకాన్ని అందిస్తాం: కలెక్టర్ వెంకటేశ్వర్లు

కేంద్రమంత్రి పీయూష్ గోయల్ నుండి అవార్డు అందుకుంటున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లాలో వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో గ్రామీణ హస్తకళల ఉత్పత్తులకు మరింత గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తానని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీ ప్రగతి భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వన్ డిస్టిక్ వన్ ప్రోడక్ట్ (ఓడిఓపి) 2024 హ్యాండ్లూమ్, హ్యాండ్ క్రాఫ్ట్ బంగారు కేటగిరీలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అవార్డును కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ చేతుల మీదుగా జిల్లా ప్రజల తరపున స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ వెంకటగిరి పట్టుచీరల ప్రత్యేకతకు జాతీయస్థాయి గుర్తింపు రావడం, అవార్డును స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. ఓడిఓపి ద్వారా చేనేత రంగానికి ఉన్న ఆదరణ, విశిష్టతను చాటుతూ జిల్లా అభివృద్ధికి తోడ్పడే విధంగా చేనేత రంగాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తానన్నారు. ప్రాంతీయ కళాకారుల ప్రతిభను జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. జాతీయస్థాయిలో తిరుపతి జిల్లాకు హ్యాండ్లూమ్స్, హ్యాండ్ క్రాఫ్ట్ కేటగిరీలో మొదటి బహుమతి (బంగారు కేటగిరి), బాపట్ల జిల్లాకు (కుప్పడం చీరలు), విజయనగరం జిల్లాకు (బొబ్బిలి వీణ), రెండవ బహుమతి ధర్మవరం చీరలు, మూడవ బహుమతి కాకినాడ (అంగర) చీరలు గుర్తింపు సాధించి బహుమతులు గెలుచుకున్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు పలువురు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఓడిఓపి హ్యాండ్ బుక్, 2024 బెస్ట్ ప్రాక్టీస్ ను కేంద్రమంత్రి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జితిన్ ప్రసాద, ఢిల్లీ సిఎం రేఖగుప్తా, ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్, హ్యాండ్లూమ్స్ మినిస్టర్ సవిత, జిల్లా చేనేత అధికారి రాచపూడి రమేష్ పాల్గొన్నారు.

ఆర్పి నుంచి డబ్బులు రికవరీ చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: డ్వాక్రా సంఘాల పర్యవేక్షకురాలుగా ఉన్న ఆర్పి (రిసోర్స్ పర్సన్) లత పై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపించి, డబ్బులు రికవరీ చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, వైఎస్ఆర్సిపి నియోజకవర్గం సమన్వయకర్త భూమన అభినయ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బైరాగి పట్టెడలోని డ్వాక్రా సంఘాలకు రుణాలు మంజూరు చేసే ఇండియన్ బ్యాంక్ ఎదుట, డ్వాక్రా సంఘాల సభ్యులతో సిపిఐ, వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదు చేయడంతో డి.ఎస్.పి ప్రసాద్ ఆధ్వర్యంలో బ్యాంక్ అధికారులు మెప్మా అధికారులు సిపిఐ నాయకులు వైసిపి నాయకులతో చర్చించి బ్యాంకు సిబ్బంది, మెప్మా సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, ఉదయ్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో 2 రోజులు తాగునీటి సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - నాయుడుపేట: మునిసిపాలిటీలోని కొన్ని ప్రాంతాల్లో 2 రోజులు తాగునీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ షేక్.ఫజులుల్లా ఒక ప్రకటనలో తెలియజేశారు. తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు చేయడం కోసం పట్టణంలోని పొగ గొట్టం కాలనీ, కాలవ గట్టు కాలనీ, జైహింద్ కాలనీ, శంకరాపురం,బాలాజీ గార్డెన్, బ్రాహ్మణ వీధి, ప్రధాన వీధి ప్రాంతాల్లో రెండు రోజులు పాటు తాగునీటి సరఫరా నిలిపి వేయబడునని తెలియజేశారు. అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తామని తెలిపారు. ఆయా ప్రాంత ప్రజలు తాగునీటి కోసం 9849742056, 9666612592, 9491285256 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

టిటిడిలో నూతన కాటేజీ విధానం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు వసతి కల్పించేందుకు నూతన కాటేజీ విధానాన్ని రూపొందించాలని అధికారులకు టిటిడి ఈవో జె. శ్యామల రావు సూచించారు. టిటిడి పరిపాలనా భవనంలోని ఈవో ఛాంబర్ లో అదనపు ఈవో సిహెచ్. వెంకయ్య చౌదరితో కలిసి సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా దాతలు కాటేజీలు నిర్మించేందుకు వీలుగా విధాన పరమైన బ్లూ ప్రింట్‌ను తయారు చేయాలన్నారు. దాతలకు ప్రివిలేజస్, దాతలకు కల్పించిన సౌకర్యాల నిర్వహణ, గదుల నిర్వహణ, సుందరీకరణ, పచ్చదనం, పార్కింగ్, కాటేజ్ డిజైన్, కాటేజీలలో శ్రీవారి ఫోటో, పెయింటింగ్, భక్తి భావం ఉట్టిపడేలా గదుల నిర్మాణం తదితర అంశాలపై సమగ్ర నివేదిక తయారు చేయాలని సూచించారు. నిర్మాణ సమయంలో నిబంధనలను అతిక్రమిస్తే స్పష్టంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను ముందుగా అంచనా వేసుకుని స్థిరంగా, శాశ్వతంగా ఉండేలా నిబంధనలు రూపొందించాలని ఈవో సూచించారు. నూతన కాటేజీల నిర్మాణానికి సంబంధించి విధానపరమైన అంశాలపై టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి వర్చువల్ ద్వారా ఈవోకు వివరించారు. ఈ కార్యక్రమంలో రిసెప్షన్ శాఖ డిప్యూటీ ఈవో భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు

నిన్న ఏడెక్స్, నేడు స్వయం, రేపు ఏమిటి ?

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో అధికారుల మారినప్పుడల్లా కొత్త కొత్త ఆన్లైన్ సర్టిఫికెట్స్ కోర్సులతో పీజీ విద్యార్థుల దగ్గర ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారని, ఆన్ లైన్ క్లాసులతో తరగతి గది విద్యకు మంగళం పాడుతున్నారని భారత విద్యార్థి ఫెడరేషన్ నాయకులు ఆరోపించారు. స్వయం యాప్‌లో కోర్సులు ద్వారా సర్టిఫికెట్స్ ఇచ్చేస్తుంటే ఇక యూనివర్సిటీలో కొత్త బిల్డింగులు కట్టడం ఎందుకు, ప్రొఫెసర్లు ఎందుకు అని ప్రశ్నించారు. ఆన్లైన్ యాప్స్ ద్వారా కోర్సులు బోధించటం ఆపి, మునుపటిలాగా ఓపెన్ ఎలక్టివ్ పేపర్ వేరే డిపార్ట్మెంటులలో తీస్కునే విధంగా ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి యూనివర్సిటీ పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

వైసిపి కార్మిక విభాగం నేతలకు సత్కారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైసిపి కార్మిక విభాగం నాయకులను సోమవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు సూదన్ రెడ్డి సత్కరించారు. వైసీపీ కార్మిక శాఖ ఉమ్మడి చిత్తూరు జిల్లా సెక్రటరీగా కాణిపాకం సురేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నీడిగింటి పవన్ కుమార్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ కార్యాలయంలో వారిని సత్కరించి బాధ్యతలు అప్పగించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ అంజూర్ తారక శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి, బర్రి సుదర్శన్ రెడ్డి, పట్టణ పగడాల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం దొరవారిసత్రం మండల కేంద్రంలోని పిహెచ్‌సి, తొగరాముడి పిహెచ్ సిల్లో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారుల తెలిపారు.

క్రైం న్యూస్

క్రోమో మెడికేర్ కెమికల్ కంపెనీలో భారీ పేలుడు

- ఇద్దరికీ తీవ్ర గాయాలు
- యాజమాన్యం నిర్లక్ష్యంతోనే రియాక్టర్‌లో పేలుడు?

ప్రజాశక్తి - రేణిగుంట : క్రోమో మెడికేర్ కెమికల్ కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం రియాక్టర్ బ్లాస్ట్ అవ్వడంతో ఇద్దరు ఉద్యోగులు తీవ్ర గాయాలై ప్రాణాపాయ స్థితిలో చెన్నైలో చికిత్స పొందుతున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గాజులమండ్యం పారిశ్రామిక వాడలో క్రోమో మెడికేర్ కెమికల్ కంపెనీలో సోమవారం మధ్యాహ్నం రియాక్టర్ పేలడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న తెలంగాణకు చెందిన రవీంద్ర, గాజులమండ్యంలో నివాసం ఉంటున్న వెంకటేష్ అరవై శాతం శరీరం కాలిపోయి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని కరకంబాడి సమీపంలో అమర ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అమర ఆసుపత్రి నుండి చెన్నైకి తరలించారు. కంపెనీలో మంటలు వ్యాపించడంతో ఫైర్ ఇంజన్ సాయంతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. సంఘటన ప్రాంతానికి శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు చేరుకుని పరిశీలించారు. క్రోమో మెడికేర్ కంపెనీలో భారీ శబ్దం రావడం పొగలు మంటలు వ్యాపించడంతో సమీప ప్రాంతంలో ఉన్న మల్లాడి డ్రగ్స్ కంపెనీ సీనియర్ మేనేజర్ దేవరాజులు తమ 30 మంది ఉద్యోగులతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. భద్రతా పరికరాలను తీసుకువచ్చి కంపెనీలోని పొగలు మంటలు వ్యాపిస్తున్న భయపడకుండా ధైర్యంగా కంపెనీ లోపలికి వెళ్లి పదిమంది ఉద్యోగులను కాపాడారు. వారిని శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, డి.ఎస్.పి శ్రీనివాసరావు అభినందించారు. క్రోమో మెడికేర్ కంపెనీలో కనీస భద్రత ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా గాజులమండ్యం పారిశ్రామికవాడ కంపెనీలలో అధికారులు పర్యటించి కనీస భద్రత ప్రమాణాలు పాటించని కంపెనీలను సీజ్ చేయాలని పలువురు కోరుతున్నారు.

చోరీ కేసుల్లో దొంగ అరెస్ట్

రికవరీ చేసిన బంగారు ఆభరణాలను చూపుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఇంటి దొంగతనాల కేసును ఛేదించి ముద్దాయిని నాయుడుపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తిరుపతి అర్బన్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 5న ఉదయం 10 నుంచి రాత్రి 8.45 గంటల మధ్య సమయంలో ఎవరో గుర్తు తెలియని దొంగలు నాయుడుపేట పట్టణములోని ముగాంబిక దేవాలయ వీధిలో నివాసం ఉంటున్న గంగినేని హరీంద్ర ఇంటిలో దొంగతనం చేసి, సుమారు 52 సవర్ల (416 గ్రాములు) బంగారు నగలను దోచుకొని పోయినారని, పోలీసులకు అందిన పిర్యాదు మేరకు, దర్యాప్తు ప్రారంభించామన్నారు. చందక మణికంఠ ఎవరికి అనుమానం రాకుండా పార్వతీపురం జిల్లా, గారుగువిల్లినుండి వచ్చి దొంగతనాలు చేసి తిరిగి వెళ్లేవాడని తెలిపారు. ఇతనిపై నిఘా ఉంచిన పోలీసులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, తన స్వగ్రామానికి వెళుతున్న ముద్దాయిని పట్టుకున్నారన్నారు. అతని వద్ద నుంచి 37 లక్షల నలభై నాలుగు వేల రూపాయలు విలువగల 52 సవర్ల (416 గ్రాములు) బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ముద్దాయిని రిమాండ్ కు తరలించామని, ముద్దాయి గతంలో అనేక నేరాలకు పాల్పడ్డాడని విచారణలో వెల్లడైందన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో డి.యస్.పి చెంచు బాబు, సీఐ బాబి, ఎస్సై ఆదిలక్ష్మి, సిబ్బంది రామ్మోహన్ రాజు, దయాకర్, భానుతేజ, వెంకటేశ్వర్లు, డ్రైవర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ మద్యం మత్తులో వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి 17 మంది ముద్దాయిలను 4 వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతిలో హాజరు పరిచారు. జడ్జి గ్రంధి శ్రీనివాస్ నిందితులు ఒక్కొక్కరికి 10,000/- చొప్పున జరిమానా, రెండు రోజులు జైలు శిక్ష విధించారు.

తిరుమల కాంటీన్లకు

ఈవోఐ గడువులో మార్పు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో 5 పెద్ద కాంటీన్లు, 5 జనతా కాంటీన్ల కేటాయింపుల కోసం టీటీడీ ఆహ్వానించిన ఈవోఐ పత్రాల జారీ, సమర్పణ, పరిశీలనకు సంబంధించిన తేదీలను పరిపాలనా కారణాల వల్ల మార్పు చేయడం జరిగింది. తాజా షెడ్యూలు ప్రకారం మారిన తేదీలు క్రింది విధంగా ఉన్నాయి: పెద్ద కాంటీన్లకు: పత్రాల డౌన్‌లోడ్ ముగింపు తేదీ: 15-07-2025 నుండి 26-07-2025 సాయంత్రం 5 గంటలకు మార్చడం జరిగింది. ఈవోఐ పత్రాల సమర్పణ చివరి తేదీ: 17-07-2025 నుండి 28-07-2025 ఉదయం 11 గంటలకు మార్చడం జరిగింది. పత్రాల తెరిచే తేది : 17-07-2025 నుండి 28-07-2025 మధ్యాహ్నం 12 గంటలకు మార్చడం జరిగింది. జనతా కాంటీన్లకు : పత్రాల డౌన్‌లోడ్ ముగింపు తేదీ: 17-07-2025 నుండి 28-07-2025 సాయంత్రం 5 గంటలకు మార్పు చేయడం జరిగింది. ఈవోఐ పత్రాల సమర్పణ చివరి తేదీ: 19-07-2025 నుండి 30-07-2025 ఉదయం 11 గంటలకు మార్పు చేయడం జరిగింది. పత్రాల తెరిచే తేదీ: 19-07-2025 నుండి 30-07-2025 మధ్యాహ్నం 12 గంటలకు మార్పు చేయడం జరిగింది. ఆసక్తి గల దరఖాస్తుదారులు మారిన తేదీలను గమనించి, దాని ప్రకారం తగినవిధంగా ఏర్పాట్లు చేసుకోవాలని విజ్ఞప్తి చేయడమైనది.

శ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, గూడూర్ లో

O.P.No. 57/2024

Nelavala Meena Kumari, W/o. Nelavala Rajesh, aged 37 years, House Maker Amaragarden, Naidupeta Town and Mandal, Tirupati District ... Petitioner

Vs

Nil .... Respondent

నోటీసు

పిటిషనర్ పై నెంబర్ గార్డియస్ O.P ని పై కోర్టులో తన కుమారుడు అయిన నెలవల జయదేవ్ మైనర్ అయినందున తన కుమారుడు పేరుమీద భీమవరం రెవిన్యూ, నాయుడుపేట మండలం లో కలిగిన ఆస్తిని అమ్ముటకు తనని గార్డియస్ గా నియమించమని పైన తెలిపిన పిటిషన్ వేసియున్నారు కావున ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల తే 22-08-2025 న ఉ.10.30 గంటలకు పై కోర్టులో మీరుగాని, మీతరుపున లాయరు గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపకోవలసినది. లేని యడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

ఇట్లు
M. Soma Sekhar, B.Sc., B.L.,
అడ్వకేట్, నాయుడుపేట.

మహారాజరాజశ్రీ తిరుపతి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులు

E.A.No.19/2025, O.E.P.No.116/2022
O.S.No.782/2011

T.Geetha ...D.Hr

V/s

P.Rathnamma (died)
W/o P.Venkatarao, D.No. 20-1-469/A-11, Maruthi Nagar, Korlagunta, Tirupati. ...J.Dr

బహిరంగ ప్రకటన

పై నెంబరు కేసులో తుమ్మలగీత అను ఆమె తనకు రావలసిన బాకీ వసూలు నిమిత్తం ప్రతివాది (J.Dr) కు సంబంధపడిన ఇల్లును జప్తు చేసి ఉంటున్నారు. సదరు J.Dr అయిన పి.రత్నమ్మ అను అమె చనిపోయినది. సదరు రత్నమ్మకు ఎవరైనా వారసులు ఉన్న ఎడల తేది. 07.08.2025 నాడు వాయిదా ఉంటున్నది. సదరు వాయిదా తేదీన నేరుగానైనా లేదా వకీలు ద్వారానైనా పై కోర్టులో ఉదయం 10.30 గం॥ల హాజరు అయి ఆక్షేపణలున్న ఎడల తెల్పుకోవాలసినది లేనిఎడల సదరు కేసును పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేదీ. 07.08.2025
చంద్రగిరి ఎల్లయ్య,
డిక్రీదారుని న్యాయవాది, తిరుపతి. సెల్: 9441394006